క్లుప్తంగా

కూలీలందరికీ ఉపాధి పనులు

మడకశిరరూరల్: గ్రామ స్థాయిలోనే పనులు చేపట్టి కూలీలందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు తెలిపారు. ఆయన శుక్రవారం ఆమిదాలగొంది పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. పనుల చేసే చోట నీడ, తాగునీరు సౌకర్యాం కల్పిస్తామన్నారు. బిల్లు ఆలస్యం చేయకుండా చెల్లిస్తామన్నారు.

కృత్రిమ పరికరాల పంపిణీ

పెనుకొండ: పట్టణంలోని కొత్తపేటలో ఉన్న భవిత కేంద్రంలో ఎంఈఓ గంగప్ప శుక్రవారం పలువురు మానసిక వికలాంగులకు కృత్రిమ సహాయ పరికరాలను అందజేశారు. నాగలూరుకు చెందిన ఆరో తరగతి విద్యార్థి గురుప్రసాద్‌కు వీల్‌చైర్, ఒకటవ తరగతి చదువుతున్న బాలుకు రోలేటర్, వినికిడి యంత్రం చినపరెడ్డిపల్లికి చెందిన కౌశిక్‌కు, కొత్తపేట పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న మహమ్మద్ ఉమర్‌కు వినికిడి యంత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని రాధామణి, ఐఆర్పీపీ వలీబా తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

పావగడ: తాలూకాలోని తిరుమణి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. స్థానిక హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్, బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి, టాటా పవర్ సోలార్ కంపెనీ సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 150 మంది కి పైగా కంటి రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 65 మంది శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. తాలూకా వైద్యాధికారి తిరుపతయ్య, శంకర ఆస్పత్రి వైద్యురాలు తేజ, తిరుమణి వైద్యాధికారి ధనుష్, పవిత్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

చిలమత్తూరు: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పలగలపల్లి సర్పంచ్ బందేపల్లి శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ మంజునాథ్ రెడ్డి, సర్పంచ్ మురళీమోహన్‌ను కలిశారు. చిలమత్తూరు పంచాయతీ నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ కోసం కష్టపడిన చిలమత్తూరు రామకృష్ణారెడ్డికి గౌరవ ప్రదమైన పదవి ఇస్తామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీల సమస్యలను ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. పార్టీ కార్యక్రమాల్లో అందరూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, హరిష్, షాకీర్, హనుమంతరెడ్డి, నాగరాజు స్వామి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలేశ్వర జ్యోతి దర్శనానికి ప్రత్యేక బస్సులు

హిందూపురం: అరుణాచలేశ్వరుడి దర్శనానికి మార్చి 6వ తేది సాయంత్రం హిందూపురం నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నామని ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.1,300 టిక్కెట్ ధరతో జ్యోతి దర్శన అవకాశం కల్పించామన్నారు.

పంట పొలాల దగ్ధం

పరిగి: మండలంలోని హొన్నంపల్లికి చెందిన రైతు, సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి పొలంలో పైప్‌లైన్‌తో పాటూ పంటకు శుక్రవారం కొందరు దుండగులు నిప్పుపెట్టారు. ఉదయం వేళ పంచాయతీ పరిధిలోని కొత్త నరసాపురం గ్రామ రోడ్డు పక్కన ఉన్న మంజునాథరెడ్డికి చెందిన మొక్కజొన్న పొలంతో పాటూ చుట్టుపక్కల ఉన్న కొందరి రైతుల పొలాలకు దుండగులు నిప్పంటించారు. ఈక్రమంలో మంజునాథరెడ్డి పొలానికి ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారు. అలాగే పైప్‌లైన్‌కు నిప్పంటించారు. అగ్నిమాపక యంత్రంతో అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలు అదుపు చేశారు. అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంట, పైప్‌లైన్‌తో కలసి రూ.50 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు.

డ్రిప్ పరికరాలు..

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లిలో అగ్ని ప్రమాదంలో డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. సమీప ప్రదేశాల్లో ఆకతాయిలు నిప్పు పెట్టడంతో గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి పొలానికి మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో డ్రిప్, వ్యవసాయ, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతై రూ.మూడు లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు మహిళా రైతు వాపోయింది.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

గోరంట్ల: మండల పరిధిలోని మందలపల్లి, గుంతపల్లి, గుమ్మయ్యగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పరిశీలించారు. పిల్లల హాజరు, పోషకాహార నిల్వలు, పంపిణీ రికార్డులను క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కొండసాని రజిత తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న రైల్వే గేటు సమస్య



చురుగ్గా జరుగుతున్న ఫ్లై ఓవర్ పనులు



గేటు వేయడంతో స్తంభించిన ట్రాఫిక్ (ఫైల్)

- శరవేగంగా ఫ్లై ఓవర్ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

సోమందేపల్లి: త్వరలో రైల్వే గేట్ సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. మండలంలోని చాకర్లపల్లి రైల్వే గేట్‌వద్ద రూ.24 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. హిందూపురం–అనంతపురం ప్రధాన రహదారి కావడంతో తరుచూ గేటు వేస్తుండడంతో అటూ వాహనదారులు, ప్రయాణికులు విసుగెత్తి పోతుండేవారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంబులెన్స్‌లో వెళ్లే రోగులు ఇబ్బంది పడేవారు. ఈ నేపథ్యంలో 2019లో కేంద్ర రైల్వే శాఖ రూ.19 కోట్లు, రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖ రూ.5కోట్లకు పైగా నిధులు మంజూరు చేశాయి. దీంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో ఫ్లై ఓవర్ పనులు పూర్తి అవుతాయని అధికారులు చెబుతున్నారు. రాకపోకలు ఇక నుంచి సాఫీగా సాగనుండడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్య తీరనుంది

చాకర్లపల్లి రైల్వేగేటు వద్ద తరచూ గేటు వేస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నాం. సకాలంలో గమ్యస్థానాలకు చేరుకునే వాళ్ళం కాదు. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయితే సౌకర్యంగా ఉంటుంది. అధికారులు పనులు పూర్తి చేసి త్వరలో రాకపోకలు ప్రారంభించాలి.

– సాయి, వాహన యజమాని



దేవాలయ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండలంలోని జీనవాండ్లపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో దాతల సహకారంతో నిర్మించ తలపెట్టిన సీతారామచంద్రస్వామి దేవాలయ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే శంకరనారాయణ భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల నివసించే జగనన్న కాలనీల్లో దేవాలయాలు, ప్రార్థనా మందిరాల నిర్మాణం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పులేరు, గోరంట్ల సర్పంచులు ప్రభాకారరావు, సరోజబాయి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పాటూరి శంకరరెడ్డి, ఉపసర్పంచులు రాజారెడ్డి, శ్రీనివాసులు, స్థానిక నాయకులు జయచంద్రారెడ్డి, సాయి తదితరులు పాలల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న మధుమతిరెడ్డి

లేపాక్షి: గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మధుమతిరెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం కొండూరు గ్రామంలో ఆమె పర్యటించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మాయ మాటలతో కాలం గడిపి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమానికి కట్టుబడ్డారన్నారు. కుల మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. మాయమాటలు చెప్పే టీడీపీని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. సేవ చేసే వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు బ్రహ్మానందరెడ్డి, రంగనాథ్, రామాంజి, ఎరపరెడ్డి, నరసింహులు, ఆదినారాయణప్ప, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం

హిందూపురం టౌన్: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెన్నపూస శివారెడ్డి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని టీచర్స్ కాలనీ, పోచనపల్లి, బేవినహళ్లి, నక్కలపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాలు, ఆస్పత్రుల్లో కరపత్రాలను అందజేశారు. వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ ద్వారా 1,34,000 ఉద్యోగాలు, పోలీసు ఉద్యోగాలు, ఏఎన్ఎం పోస్టులు, వైద్య శాఖలో పోస్టులు భర్తీ చేశారన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, నిజాముద్దీన్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన యువజన జిల్లా అధ్యక్షుడు



ఎమ్మెల్యేను కలసిన పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బీఎల్ లోకేష్

పెనుకొండ: పట్టణంలోని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ స్వగృహంలో ఎమ్మెల్యేను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బీఎల్ లోకేష్ కలిశారు. రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం లోకేష్‌ను యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యేను కలసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభ్యున్నతి కోసం అహర్నిశలూ పాటుపడతానని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు.

రొద్దం: తన నియమకానికి కృషిచేసిన పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పెద్ద గువ్వలపల్లి జెట్టి మారుతీప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పెనుకొండ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన ఎమ్మెల్యేను కలసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, సచివాలయాల సమన్వయకర్త రవిశంకర రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాజారెడ్డి, రాజగోపాల్ రెడ్డి తదితతరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయండి

- పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

అమరాపురం: గ్రామాల్లోని సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సమయ పాలన పాటించాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా హాలుకూరు గ్రామ సచివాలయం–1ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టిక పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. అదేవిధంగా భూ రీసర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డిమాండ్ మేరకు శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలన్నారు. తమ్మడేపల్లి రోడ్డు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

నష్టపరిహారం అందేలా చర్యలు

మడకశిర: మడకశిర మండలంలో రైల్వే నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు నష్టపరిహారం వెంటనే అందే విధంగా చర్యలు తీసుకోవాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ స్థానిక అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మడకశిర తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అంతేకాకుండా రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ అంశంపై కూడా స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందించిన నష్టపరిహారం వివరాలపై ఆరా తీశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులు, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు

పెనుకొండ: అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ కార్తీక్ హెచ్చరించారు. పట్టణంలోని తిరంగరాయల చెరువు ప్రాంతంలో చండానాయక్ అనే వ్యక్తి అక్రమ కట్టడాలు కడుతున్నట్లు కొందరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని సబ్‌కలెక్టర్‌తో పాటు, తహసీల్దార్ స్వర్ణలత, నగర పంచాయతీ చైర్మన్ వంశీకృష్ణభార్గవ్ తనిఖీ చేపట్టారు. ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించిన సబ్ కలెక్టర్ చెరువు ప్రాంతంలో ఎలాంటి అక్రమ కట్టడాలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

హిందూపురం: ప్రభుత్వ అనుమతి లేనిదే పట్టణంలో ఎక్కడా విగ్రహాలు ఏర్పాటు చేయడానికి వీలు లేదని డీఎస్పీ యశ్వంత్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సౌజన్య అన్నారు. శుక్రవారం రాత్రి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో మాట్లాడారు. పబ్లిక్ ప్రదేశాలు, రహదారులు, ప్రజల అవసరాలైన ప్రాంతాల్లో ఎలాంటి విగ్రహాలు పెట్టరాదనే ఆదేశాలున్నాయని తెలిపారు. ప్రజల శాంతి భద్రతలు ముఖ్యమని, శాంతియుత జీవనానికి అందరూ సహకరించాలని కోరారు. సీఐలు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ

హిందూపురం: ఢిల్లీలోని గురుగాన్ వద్ద శృతి ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2022లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన మొదటి ఇంటర్నేషనల్ ఆర్ట్స్ వర్క్‌షాపులో హిందూపురంలోని ఓం క్రియేషన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు అవార్డులు సాధించారు. శృహిత వైష్ణవి, హనుమేష్, నిశ్చల గోల్డ్ మెడల్స్ సాధించారని ఓం క్రియేషన్ వ్యవస్థాపకుడు సరస్వతీ వెంకటేష్ తెలిపారు.

శ్మశాన వాటిక సమస్య పరిష్కరించండి

గోరంట్ల: మండలంలోని మందలపల్లి ఎస్సీ కాలనీలో శ్మశాన వాటిక లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్య పరిష్కరించాలని శుక్రవారం కాలనీ వాసులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం తహసీల్దార్ రంగనాయకులకు వినతి పత్రం సమర్పించారు. సమస్యను పరిష్కరిస్తామని కాలనీ వాసులకు తహసీల్దార్ హామీ ఇచ్చారు. అలాగే శ్మశాన వాటిక సమస్య పరిష్కరించాలని కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు.

శ్మశాన వాటిక కోసం స్థల పరిశీలన: మందల పల్లి ఎస్సీ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించడానికి తహసీల్దార్ రంగనాయకుల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. కాలనీ కొంత దూరంలోని ప్రభుత్వ భూమిని గుర్తించి సర్వే నిర్వహించారు.

రోగులకు అందుబాటులో ఉండండి

అమరాపురం: స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఎంపీపీ ఈరన్న కోరారు. శుక్రవారం సాయంకాలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లు విధుల్లో ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఆసుపత్రిలో డాక్టర్ ఉండడం లేదని ఫోన్ ద్వారా రోగులు సమాచారం ఇస్తున్నారన్నారు. డాక్టర్ ఎక్కడా అని అడగ్గా పుట్టపర్తికి మీటింగ్‌కు వెళ్లారని సిబ్బంది సమాచారం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇలా అయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీపీ అన్నారు. వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి ఉన్నారు.

భూముల పరిశీలన

రొళ్ల: ఆర్.వడ్రహట్టి సమీపాన సమస్యాత్మక భూములను తహసీల్దార్ హసీనాసుల్తానా శుక్రవారం పరిశీలించారు. దీంతో రొళ్ల రెవెన్యూ పొలం సర్వే నంబర్ 3–3లో అగ్రహారం, ఆర్.వడ్రహట్టికి చెందిన ఈరమ్మ, తిప్పేస్వామి భూ సమస్యల పరిష్కారం కోసం ఆర్‌ఓఆర్ ద్వారా(అప్పీల్) అర్జీని సబ్ కలెక్టర్‌కు సమర్పించారు. దీంతో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు భూమిని పరిశీలించి నివేదికలు సమర్పిస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లేపాక్షి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి సూచించారు. లేపాక్షి పీహెచ్‌సీని అనీమియా ముక్త్ భారత్ నోడల్ ఆఫీసర్ కొండారెడ్డితో కలిసి డీఎంహెచ్‌ఓ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం కొండూరులో డ్రైడే –ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించారు. గర్భిణుల వైద్య పరీక్షల వివరాలు తెలుసుకుని అనీమియా వ్యాధులపై అవగాహన కల్పించారు. రక్తహీనత వలన కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటచిరంజీవి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శివన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు తోడుగా నిలుద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్

హిందూపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు గృహసారథులు, కన్వీనర్లు విజయ వారధులుగా మారాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో పట్టణ గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. 'మా నమ్మకం నువ్వే జగన్' సిక్కర్లు, గత రాక్షస పాలన–ప్రస్తుత రాజన్న పాలన వ్యత్యాసం తెలిపే కరపత్రాలు, ప్రజా మద్దతు పుస్తకం, జగనన్న ఫొటోతో ఉన్న మొబైల్ సిక్కర్లు ఉంటాయన్నారు. వీటిని తీసుకుని సచివాలయాల వారీగా ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించాలన్నారు. పథకాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ వివరించాలన్నారు. ముఖ్యంగా గత టీడీపీ రాక్షస పాలన, నేటి రాజన్న పాలనలో తేడాలను ప్రజలకు క్షుణంగా తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు మేలు జరుగుతుంటే టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ మోసాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలన్నారు. హిందూపురం టీడీపీ కోటా అని చెప్పుకుంటూ కాలం గడిపిన టీడీపీ నాయకులకు చెక్ పెట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే హిందూపురం నియోజకవర్గం అన్ని రకాల అభివృద్ధి చెందుతుందన్నారు. 35 ఏళ్లుగా ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలు హిందూపురాన్ని అభివృద్ధి చేయలేకపోయారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న బాలకృష్ణ కనీసం అసెంబ్లీకి వెళ్లలేదన్నారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో రాజకీయాలకు అతీతంగా అందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు, వార్డు కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌తో వాగ్వాదం చేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి

రొద్దం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికారం, కోడిగుడ్లు బయట దుకాణాల్లో కొందరు అంగన్‌వాడీ వర్కర్లు అమ్ముకుంటున్నారని సింగిల్‌విండో చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి ఆరోపించారు.ఐసీడీఎస్ అధికారులు మాముళ్ల మత్తులో ఉన్నారని ఆరోపించారు.సానిపల్లి సర్పంచ్ పరమేశ్వరయ్య మాట్లాడుతూ సెంటర్లకు సక్రమంగా వెళ్లని అంగన్‌వాడీ వర్కర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పలు శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ సమావేశపు భవనంలో మండల అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల పనితీరుపై చర్చించారు. సమావేశం జరుగుతుండగా పలు సమస్యలపై అధికారులను సభ్యులు నిలదీశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. పప్పుశనగ రైతులు విక్రయంఆల కోసం సమీప రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు రిజిస్టర్ చేయించుకోవాలని ఏఓ నివేదిత సూచించారు. సమావేశానికి హాజరు కాని విద్య, విద్యుత్, ఫారెస్ట్, రవాణా, రోడ్లు, భవనాలు తదితర శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపీపీ ఆదేశించారు. మండల వ్యాప్తంగా సమస్యలను ఆయా శాఖల అధికారులు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని మండలాధ్యక్షుడు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావతి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, తహసీల్దార్ అనంతచారి, డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



ఎంపీడీఓతో వాగ్వివాదానికి దిగిన సభ్యులు

సోమందేపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు రామాంజి, సోము, జీలాఖాన్, కిష్టప్ప, అంజినాయక్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంతో రేషన్ కార్డుల జారీ, ఇంటి నిర్మాణాలకు పొజిషన్ సర్టిఫికెట్లు సకాలంలో మంజూరు కావడం లేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ఎంపీడీఓ వెంకటేశ్వర్లుతో వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. వేసవి కాలం సమీపించడంతో తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రత్నమ్మ, సీడీపీఓ శాంతలక్ష్మి, కోఆప్షన్‌సభ్యుడు, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై ఇంటింటా ప్రచారం



పంచరత్న పథకాలను వివరిస్తున్న జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప

పావగడ: మాజీ సీఎం కుమారస్వామి రూపొందించిన పంచరత్న పథకాల ఇంటింటా ప్రచారానికి స్థానిక జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప శుక్రవారం శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 12,13,14 వార్డుల్లో పర్యటించి పంచ రత్న పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. విద్య, వైద్యం, సేద్యం, ఉద్యోగం, జలం పథకాలను జేడీఎస్ అధికారం లోకి వస్తే అమలు చేస్తామని చెప్పారు. జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప మాట్లాడుతూ వచ్చే విధాన సభ ఎన్నికల్లో స్థానిక జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పను అధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. నాయకులు బలరామరెడ్డి, ఎన్ఈ ఈరణ్ణ, రామకృష్ణారెడ్డి, యూనస్, కావలగేరి రామాంజినప్ప, గడ్డం తిమ్మరాజు, వెంకటేశ్, మనుమహేశ్, అంబికా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతాభివృద్ధి

హిందూపురం: విద్యతోనే ఉన్నతాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక సెవెన్ హిల్స్ ఫంక్షన్‌హాల్‌లో ఇక్రా స్కూల్ 7వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, అవార్డులు అందజేశారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

మడకశిర: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ప్రభాకరరావు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు డ్రై డేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, ఎంపీడీఓ సోనిబాయి, ఈఓఆర్‌డీ శైలజ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రొళ్ల: మార్చి 13న జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సెక్టోరల్ అధికారి వీరనరేష్, తహసీల్దార్ హసీనాసుల్తానాతో కలిసి శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తొలుత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సెక్టరల్ అధికారి, రెవెన్యూ సిబ్బందితో కలిసి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, కిటికీలు, వాకిళ్లతో పాటు ఇతరాత్ర సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కరించుకోవాలన్నారు. ఎస్ఐ వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.